# వేగుచుక్క

VC NEWS

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ డిసెంబర్ 17 మంగళవారం 2024

వెల:రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 147

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




2లో

## జై శ్రీరామ్ నినాదాలు చేయడం ఎలా నేరపూరిత చర్య?

మసీదు లోపల నినాదాలు చేసిన వారిని ఎలా గుర్తించారు?

ఫిర్యాదుదారున్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు

# వాకౌట్.. వాయిదాలు..

రెండో రోజు అసెంబ్లీ ప్రశ్నోత్తరాలకే పరిమితం

సభలో రెండు ప్రభుత్వ బిల్లులు ప్రవేశపెట్టిన ప్రభుత్వం

పలు అంశాలపై బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ వాయిదా తీర్మానాలు

నేడు ఉదయం 10 గంటలకు తిరిగి సమావేశం

సభా సంప్రదాయాలను విపక్షసభ్యులు పట్టించుకోవట్లేదు బీఆర్ఎస్? తీరును ఖండించిన మంత్రులు ఎలాంటి నిర్ణయాలు లేకుండానే ముగిసిన బీఏసీ సమావేశం 21వరకు అసెంబ్లీ సమావేశాలు బిఎసిలో శాసనసభ స్పీకర్ నిర్ణయం బీఏసీ సమావేశం నుంచి బీఆర్ఎస్, ఎంఐఎం వాకౌట్



హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ శీతాకాల సమావేశాల రెండో రోజు సోమవారం బీఆర్ఎస్ నిరసన లు, వాకౌట్, అధికారపక్ష సభ్యుల విమర్శల మధ్య శాసనసభ అర్ధంతరంగా ముగిసింది. ఈ నెల 9న అసెంబ్లీ సమావేశాలు లాంఛనంగా ప్రారంభమైన విషయం తెలిసిందే. ఆ ఒక్క రోజే భేటీ నిర్వహించి, 16వ తేదీకి (సోమవారానికి) వాయిదావేశారు. ఈమేరకు సోమవారం ఉదయం 10 గంటలకు శాసనసభ సమావేశం ప్రారంభమైనా.. ప్రశ్నోత్తరా లు, సంతాప తీర్మానాలు, ప్రభుత్వ బిల్లుల ప్రతిపాదనకే పరిమితమైంది.

మాజీ సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లుల చెల్లింపుపై ప్రభుత్వం నిర్దిష్ట హామీ ఇవ్వలేదని నిరసన తెలుపుతూ బీఆర్ఎస్ ప్రశ్నోత్తరాల సమయంలో సభ నుంచి వాకౌట్ చేసింది. ప్రశ్నోత్తరాలు, టీ విరామం తర్వాత సభ తిరిగి సమావేశంకాగానే.. 'లగచర్ల'అంశంపై చర్చకోసం బీఆర్ఎస్ పట్టుబట్టింది. ఈ గందరగోళంతో స్పీకర్ సభ ను మంగళవారం ఉదయానికి వాయిదా వేశారు.

నిర్దేశిత సమయంలోనే ప్రశ్నోత్తరాలు

సోమవారం ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమైన వెంటనే ప్రశ్నోత్తరాలకు సంబంధించి స్పీకర్ ప్రకటన చేశారు. రోజూ గంటపాటు జరిగే ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో.. పది ప్రశ్నలకు ఒక్కో ప్రశ్నకు ఆరు నిమిషాల సమయం లభిస్తోందని తెలిపారు. కానీ నిర్దేశిత సమయంలో పూర్తి చేయకపోవడం, కొన్ని ప్రశ్నలు మిగిలిపోవడంతో సభ్యులు అసంతృప్తి చెందుతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో సభ్యులు, మంత్రులు ప్రశ్నలు, సమాధానాలు సూటిగా, క్లుప్తంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు.

సంతాప తీర్మానాలు.. బిల్లులు..

ఉమ్మడి ఏపీ శాసనసభలో తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించిన ముగ్గురు దివంగత సభ్యులకు శాసనసభ రెండు నిమిషాల పాటు సంతాపం ప్రకటించింది. మాజీ ఎమ్మెల్యేలు కొమిరెడ్డి జ్యోతిదేవి (మెట్‌పల్లి), ఊకె అబ్బయ్య (బూర్గంపాడు, ఇల్లందు), డి.రామచంద్రారెడ్డి (దొమ్మాట) మరణం పట్ల స్పీకర్ ప్రసాద్‌కుమార్ సంతాప తీర్మానం ప్రతిపాదించారు. 'యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ ఆఫ్ తెలంగాణ బిల్లు 2024'ను సీఎం రేవంత్ పక్షాన మంత్రి శ్రీధర్‌బాబు సభకు సమర్పించారు. 'తెలంగాణ యూనివర్సిటీస్ (సవరణ) బిల్లు%-%2024'ను సీఎం తరఫున మంత్రి దామోదర రాజనర్సింహ సభలో ప్రవేశపెట్టారు. వాయిదా తీర్మానాలన్నీ తిరస్కరించిన స్పీకర్

అసెంబ్లీ సమావేశాల రెండో రోజున బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ సభ్యులు ఇచ్చిన పలు వాయిదా తీర్మానాలను స్పీకర్ తిరస్కరించారు.

'లగచర్ల'అంశంపై చర్చించాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, విజయుడు, మర్రి రాజశేఖర్‌రెడ్డి వాయిదా తీర్మానం ప్రతిపాదించారు. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పెద్దపులి దాడులను అరికట్టడం, బాధితులకు పరిహారం అందించే అంశంపై బీజేపీ ఎమ్మెల్యేలు పాల్వాయి హరీశ్, పాయల్ శంకర్ వాయిదా తీర్మానం ఇచ్చారు. మూసీ ప్రక్షాళన, హైడ్రాపై చర్చించాలంటూ సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వాయిదా తీర్మానం ఇచ్చారు.

## పంచాయితీలకు బిల్లుల చెల్లింపు



అసెంబ్లీలో వాడీవేడిగా చర్చ

ప్రభుత్వం తీరుకు నిరసనగా బిఆర్ఎస్ వాకౌట్

బకాయిల రాష్ట్రమితి అంటూ సీతక్క కౌంటర్

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో గ్రామ పంచాయతీలకు చెల్లించాల్సిన బకాయిల విషయంలో బిఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య వాడి వేడిగా చర్చ జరిగింది. రాష్ట్రంలో బడా కాంట్రాక్టర్లకు మాత్రం బిల్లులు విడుదల చేస్తున్నారని..కానీ సర్పంచులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. రూ.691 కోట్ల బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. దీనికి మంత్రి సీతక్క కౌంటర్ ఇచ్చారు. గత ప్రభుత్వమే ఈ బకాయిలు చెల్లించాల్సి ఉంటే బాగుండేదని చురకలంటించారు. బిఆర్ఎస్ అంటే బకాయిల రాష్ట్ర సమితిగా మారిందని దుయ్యబట్టారు. సర్పంచ్ ల బకాయిలు తమ ప్రభుత్వానికి బిఆర్ఎస్ వారసత్వంగా ఇచ్చిందని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ప్రతి నెలా రూ.274 కోట్లు గ్రామ పంచాయతీలకు ఇచ్చామని హరీశ్ చెప్పారు. అయితే ప్రభుత్వ తీరునకు నిరసనగా బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. సోమవారం ఉదయం మళ్లీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు మాట్లాడుతూ.. సర్పంచుల పెండింగ్ బిల్లులపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రూ. 691 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని.. రాష్ట్రంలో బడా కాంట్రాక్టర్లకు మాత్రం బిల్లులు వస్తున్నాయి విమర్శించారు. ఏడాదిగా బిల్లులు చెల్లించకుండా సర్పంచులను గోస పెడుతున్నారని నిలదీశారు.

## రాజ్యాంగ పరిక్షణకు తీసుకున్న చర్యలేవీ



నెహ్రూను విమర్శించడం ఎంతవరకు సబబు

రాజ్యసభలో చర్చలో ఏకిపారేసిన మల్లిఖార్జున ఖర్గే

**న్యూఢిల్లీ:** రాజ్యసభలో రాజ్యాంగంపై వాడీవేడి చర్చ కొనసాగింది. ఈ నేపథ్యంలో మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూపై విమర్శలు చేసిన కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, భాజపాపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే విరుచుకుపడ్డారు. నిర్మలా సీతారామన్ జేఎన్‌యూ నుంచి పట్టభద్రురాలు, ఆర్థిక నిపుణురాలు కావొచ్చు గానీ.. ఆమె చర్యలు మాత్రం బాగాలేవంటూ విమర్శించారు.'భాజపా విభజన సూత్రాన్ని నమ్ముతోంది. ప్రజలకు స్వేచ్ఛ, సమానత్వం కావాలి. భాజపా పాలనలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. నెహ్రూ, ఇందిరాగాంధీలను భాజపా కించపరుస్తోంది. దేశం కోసం భాజపా ఎప్పుడూ పోరాటం చేయలేదు. అలాంటి వ్యక్తులు నెహ్రూ గురించి మాట్లాడటం విడ్డూరం. రాజ్యాంగానికి భాజపా అనుకూలమా? వ్యతిరేకమా? ప్రాథమిక సమస్యల పరిష్కారానికి భాజపాకు ఆసక్తిలేదు అంటూ విమర్శలు చేశారు.. జాతీయ జెండా, రాజ్యాంగాన్ని ఎప్పుడూ గౌరవించని వారు.. రాజ్యాంగంపై

మిగతా 2లో

## కొత్తగా 10 లక్షల రేషన్ కార్డులు

31 లక్షల మందికి ప్రయోజనం

శాసన మండలిలో మంత్రి ఉత్తమ్ ప్రకటన

2లో




## తెలంగాణ ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

మార్చి 5నుంచి ఇంటర్ పరీక్షలు

ఫిబ్రవరి 3 నుంచి ప్రాక్టికల్స్

2లో




## మహా కుంభమేళా..

45 కోట్ల మంది యాత్రికుల కోసం ఏర్పాట్లు!

ప్రయాగ్‌రాజ్‌లో జరిగే మహా కుంభమేళా కోసం దాదాపు 45 కోట్ల మంది యాత్రికులు రానున్నట్లు యూపీ ప్రభుత్వం అంచనా వేస్తోంది.



2లో

వేగుచుక్క


# ఏపీ సీఎం చంద్రబాబుతో డిప్యూటీ సీఎం భేటీ



కొత్త సభ్యులు కొలువుదీరిన నేపథ్యంలో నాగబాబును మంత్రి వర్గంలోకి తీసుకోవాలనే నిర్ణ?యంపై ఈ భేటీలో చర్చించినట్టు తెలుస్తోంది. చంద్రబాబుతో జరిగిన భేటీలో నామినేటెడ్ పదవుల తుది జాబితాను ఖరారు చేయడంతో పాటు ఇతర అంశాలపైనా చర్చించినట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించిన నేపథ్యంలో రాబోయే సహకార ఎన్నికల్లోనూ ఇదే తరహా సమన్వయం కొనసాగించాలని ఇరువురు నేతలు ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

# తెలంగాణ ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

హైదరాబాద్: తెలంగాణ ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. వచ్చే ఏడాది మార్చి 5 నుంచి 25 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఫిబ్రవరి 3 నుంచి 22 వరకు ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించనున్నారు. జనవరి 29న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్ పరీక్ష, 30న పర్యావరణ పరీక్ష జరగనుంది. ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్షను ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు జనవరి 1న, సెకండియర్ విద్యార్థులకు ఫిబ్రవరి 1న నిర్వహించనున్నారు. రెగ్యులర్, ఒకేషనల్ విద్యార్థులకు ఒకేసారి ఈ పరీక్షను నిర్వహిస్తారు. ఇంటర్ రెగ్యులర్, ఒకేషనల్ విద్యార్థులకు ఫిబ్రవరి 3, 2025 నుంచి ఫిబ్రవరి 22, 2025 వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. రెండు సెషన్లలో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు




ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి. మరోవైపు ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల టైమ్ టేబుల్ విడుదలైంది. మార్చి 1నుంచి ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా ప్రకటించారు. ఇంటర్మీడియట్ రెగ్యులర్,ఒకేషనల్ విద్యార్థులకు మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు 9 గంటల నుంచి 12 గంటల వరకు జరుగుతాయి.

తెలంగాణ ఇంటర్ పరీక్షల షెడ్యూల్ ఇదే..

ఫస్ట్ ఇయర్ పరీక్షల తేదీలు ఇవే

05-03-2025 - పార్ట్-2 సెకండ్ ల్యాంగ్వేజ్
07-03-2025 - పార్ట్-1 ఇంగ్లీష్ పేపర్
11-03-2025 - మాథ్స్ పేపర్ 1%ూ%, బోటని పేపర్-1 , పొలిటికల్ సైన్స్ పేపర్-1
13-03-2025 - మ్యాథ్స్ పేపర్ 1%దీ% , జూలాజి పేపర్ -1, హిస్టరీ పేపర్-1
17-03-2025 - ఫిజిక్స్ , ఎకనామిక్స్
19-03-2025 - కెమిస్ట్రీ , కామర్స్

సెకెండ్ ఇయర్ పరీక్షల తేదీలు ఇవే

06-03-2025 - పార్ట్-2 సెకండ్ ల్యాంగ్వేజ్
10- 03-2025 - పార్ట్-1 ఇంగ్లీష్
12-03-2025 - మాథ్స్ పేపర్ 2%ూ%, బోటని , పొలిటికల్ సైన్స్
15-03-2025 - మ్యాథ్స్ పేపర్ 2%దీ% , జూలాజి, హిస్టరీ
18-03-2025 - ఫిజిక్స్ , ఎకనామిక్స్
20-03-2025 - కెమిస్ట్రీ , కామర్స్

# ఎలాంటి విపత్తులనయినా ఎదుర్కొంటాం



అధికారులకు మూడ్రోజులపాటు అవగాహన కల్పించనున్నారు. బుడమేరు వరదలు, హుద్ హుద్ తుపాను, ఇతర విపత్తులను సీఎం చంద్రబాబు సారథ్యంలో సమర్థవంతంగా ఎదుర్కొన్నామని హోంమంత్రి అనిత చెప్పారు. సముద్రంలో వేటగాళ్లను అప్రమత్తం చేసే సాంకేతిక పరికరాలను గత వైసీపీ ప్రభుత్వం మూలన పడేసిందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అలా చేయడం ద్వారా మత్స్యకారుల ప్రాణాలకు హాని పొంచి ఉందని అనిత చెప్పారు. రాష్ట్రంలో ఎటువంటి విపత్తు వచ్చినా ఎదుర్కొనేలా సీఎం చంద్రబాబు ఆదేశాలతో అన్ని శాఖల అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం అభినందనీయమని అనిత అన్నారు. విపత్తు నిధుల గురించి ఎన్డీయే ప్రభుత్వంలో ఏమాత్రం డోకా లేదని ఆమె చెప్పారు. ఎన్ఐడీఎమ్ వంటి సంస్థలు ఇస్తున్న శిక్షణను అన్ని శాఖల అధికారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ప్రమాద అంచనా, ముందస్తు అవగాహన, విపత్తులు సంభవించినప్పుడు స్పందనపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని హోంమంత్రి అనిత సూచించారు.

# జై శ్రీరామ్ నినాదాలు చేయడం ఎలా నేరపూరిత చర్య?

న్యూఢిల్లీ: జై శ్రీరామ్ నినాదాలు చేయడం నేరపూరిత చర్య ఎలా అవుతుందని సుప్రీంకోర్టు సోమవారం ప్రశ్నించింది. మసీదు లోపల నినాదాలు చేశారనే ఆరోపణలతో ఇద్దరు వ్యక్తులపై విచారణను కొట్టివేస్తూ కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పుపై అప్పీల్‌ను సమీక్షిస్తూ న్యాయమూర్తులు పంకజ్ మిథాల్, సందీప్ మెహతా ఈ అంశాన్ని లేవనెత్తారు. మసీదు లోపల 'జై శ్రీరామ్' నినాదాలు చేసిన ఇద్దరు వ్యక్తులపై విచారణను రద్దు చేసిన కర్ణాటక హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన భారత అత్యున్నత న్యాయస్థాన ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. హైదర్ అలీ సిఎం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఒక నిర్దిష్ట మతపరమైన పదబంధాన్ని లేదా పేరును అరుస్తుంటే అది ఎలా నేరం అని బెంచ్ ప్రశ్నించింది. మసీదు లోపలికి వచ్చి నినాదాలు చేసిన వారిని ఎలా గుర్తించారని సుప్రీంకోర్టు ఫిర్యాదుదారుని ప్రశ్నించింది. విచారణ సందర్భంగా, పిటిషనర్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది దేవదత్ కామత్‌ను సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. ఈ ప్రతివాదులను ఎలా గుర్తిస్తారు? అవన్నీ సీసీటీవీలో రికార్డయ్యాయని అంటున్నారు. లోపలికి వచ్చిన వ్యక్తులను ఎవరు గుర్తించారని బెంచ్ ప్రశ్నించింది. భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 503 లేదా సెక్షన్ 447లోని నిబంధనలను అభియోగాలు తాకడం లేదని హైకోర్టు గుర్తించిందని ధర్మాసనం పేర్కొంది. భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 503 క్రిమినల్ బెదిరింపులకు సంబంధించిందని, అయితే సెక్షన్ 447 నేరపూరిత అతిక్రమణకు శిక్షను సూచిస్తుందని సుప్రీంకోర్టు పేర్కొంది. ఫిర్యాదును ప్రస్తావిస్తూ, ఎఫ్ఐఆర్ నేరాల ఎన్‌సైక్లోపీడియా కాదని కామత్ అన్నారు. మసీదులోకి ప్రవేశించిన అసలు వ్యక్తులను మీరు గుర్తించగలిగారా? దీనిపై రాష్ట్ర పోలీసులు వివరణ ఇవ్వాల్సి ఉంటుందని కామత్ అన్నారు. దీనిపై ధర్మాసనం పిటిషన్ కాపీని రాష్ట్రానికి ఇవ్వాలని పిటిషనర్‌ను కోరగా, కేసు తదుపరి విచారణను 2025 జనవరికి వాయిదా వేసింది. అంతకుముందు సెప్టెంబర్ 13న, ఈ కేసులో ఇద్దరు వ్యక్తులపై క్రిమినల్ ప్రొసీడింగ్‌లను కర్ణాటక హైకోర్టు రద్దు చేసింది. ఎవరైనా 'జై శ్రీరామ్' అంటూ నినాదాలు చేస్తే ఏ వర్గానికి చెందిన వారి మనోభావాలను ఎలా దెబ్బతీస్తారన్నది అర్థం కావడం లేదని కర్ణాటక హైకోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ ఘటనలో ఎలాంటి ప్రజా విఘాతం లేదా ఎలాంటి చీలిక ఏర్పడినట్లు ఎలాంటి ఆరోపణలు లేవని వ్యాఖ్యానించింది. ఐపిసి సెక్షన్ 506 ప్రకారం నేరపూరిత బెదిరింపు నేరానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి ఎవరో కూడా ఫిర్యాదుదారు చూపలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. మసీదులోకి ప్రవేశించి మతపరమైన నినాదాలు చేశారనే ఆరోపణలతో ఇద్దరు వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్‌పై కర్ణాటక హైకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్, ప్రొసీడింగ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటన 2023 సెప్టెంబర్ 24న జరిగింది. పుత్తూరు సర్కిల్‌లోని కడప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు మసీదులోకి ప్రవేశించి 'జై శ్రీరామ్' నినాదాలు చేయడంతో బెదిరింపులకు దిగారని ఫిర్యాదుదారు ఆరోపించారు. ఎలాంటి ఆరోపణ చేసిన నేరాలకు సంబంధించిన ఆధారాలు లేకుండా, పిటిషనర్లపై విచారణ కొనసాగించడం చట్టపరమైన దుర్వినియోగం అవుతుందని, న్యాయపరమైన అనుచితానికి దారి తీస్తుందని హైకోర్టు నిర్ధారించింది.

# కొత్తగా 10 లక్షల రేషన్ కార్డులు

**హైదరాబాద్**: ప్రభుత్వ అంచనా ప్రకారం.. కొత్తగా పది లక్షల కొత్త రేషన్ కార్డుల మంజూరు ఉండవచ్చని.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. తద్వారా 31 లక్షల మందికి ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. కొత్త రేషన్ కార్డుల మంజూరికి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వేను కుడా ఆధారం చేసుకుంటామన్నారు. కొత్త తెల్ల రేషన్ కార్డుల మంజూరీతో.. ప్రభుత్వంపై అదనంగా రూ.956 కోట్ల భారం పడుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులను జారీ చెయ్యబోతున్నట్లు ఉత్తమ్ వెల్లడించారు ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డులలో అదనపు పేర్ల నమోదుకు.. మీ సేవ కేంద్రం ద్వారా గడిచిన పదేళ్లుగా వచ్చిన 18 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కొత్త తెల్ల రేషన్ కార్డుల మంజూరికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రివర్గ ఉపసంఘం నియమించారని చెప్పారు. తనను ఛైర్మన్‌గా, సహచర మంత్రులు దామోదరం రాజనరసింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు సభ్యులుగా



ఉన్నారని వెల్లడించారు. ఈ ఉప సంఘం పలుమార్లు సమావేశమై.. సిఫారసులను కేబినెట్ ఆమోదం కోసం పంపించినట్లు తెలిపారుతెల్ల రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియలో సుప్రీంకోర్టుకు సక్సేనా కమిటీ సమర్పించిన సిఫారసులను పరిగణనలోకి తీసుకున్నట్లు ఉత్తమ్ చెప్పారు. అంతే గాకుండా రాష్ట్రంలోని శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, లోక్‌సభ, రాజ్యసభ సభ్యుల నుండి సేకరించిన సూచనలను కుడా మంత్రివర్గ ఉప సంఘం పరిగణనలోకి తీసుకున్నట్లు ఆయన చెప్పారు. వీటన్నింటినీ అధ్యయనం చేసిన ఉపసంఘం.. కొత్త తెల్ల రేషన్ కార్డుల మంజూరికి అర్హతా ప్రమాణాలు నిర్ణయిస్తూ చేసిన సిఫారసులు.. కేబినెట్ ముందుంచినట్లు ఆయన వివరించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న చౌక ధరల దుకాణాల డీలర్ల భర్తీ ప్రక్రియను చేబడతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. కొత్తగా ఏర్పడ్డ గ్రామ పంచాయతీలతో పాటు తాండాలలో కుడా చౌక ధరల దుకాణాల ఏర్పాటు చేస్తామన్నారు. చౌక ధరల దుకాణాల ద్వారా ఇప్పటి వరకు పంపిణీ చేస్తున్న దొడ్డు రకం బియ్యాన్ని ప్రజలెవ్వరు వినియోగించక పోవడంతో.. దారి మళ్లుతున్న వాస్తవాన్ని ప్రభుత్వం గుర్తించిందన్నారు. అందుకే తెల్ల రేషన్ కార్డు దారులందరికి ఇకపై సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. తెలంగాణా రాష్ట్రం ఏర్పాటుకు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణా ప్రాంతంలో.. 91 లక్షల 68 వేల 231 రేషన్ కార్డులు ఉండేవన్నారు. మొత్తం లబ్ధిదారుల సంఖ్య 3.38 కోట్లని ఆయన సభకు వివరించారు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం ఇక్కడి నుండి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు తమ తమ ప్రాంతాలకు తిరిగి వెళ్లారని.. 2 లక్షల 46 వేల 324 రేషన్ కార్డులు రద్దు అయినట్లు ఉత్తమ్ వెల్లడించారు. తెలంగాణా ఏర్పడ్డాక 2.7 కోట్ల లబ్ధిదారులకు గాను మొత్తం 89 లక్షల 21 వేల 907 తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయన్నారు.

# పురిటినొప్పులతో గ్రూప్-2 పరీక్ష గర్భిణికి అండగా అధికార యంత్రాంగం

నాగర్‌కర్నూల్: నాగర్‌కర్నూల్ జిల్లాలో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. పురిటి నొప్పులతోనే ఓ అభ్యర్థి గ్రూప్-2 పరీక్ష రాశారు. బల్మూరు మండలం బాణాల గ్రామానికి చెందిన రేవతి నాగర్



కర్నూల్ పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రూప్-2 పరీక్ష రాసేందుకు వెళ్లారు. పరీక్ష రాస్తున్న సమయంలోనే ఆమెకు పురిటి నొప్పులు వచ్చాయి. అప్రమత్తమైన పరీక్ష నిర్వహణ సిబ్బంది.. ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యారు. అందుకు ఆమె అంగీకరించలేదు. పరీక్ష రాస్తానని చెప్పారు. ఆమె కాన్పు తేదీ ఇవాళే కావడంతో అందరూ కాస్త ఆందోళనకు గురయ్యారు. అయినా, ఆమె పట్టు వదలకుండా పరీక్ష రాస్తానని చెప్పడంతో.. అధికారులు ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ సంతోష్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం.. పరీక్ష కేంద్రంలో 108 అత్యవసర వాహనాన్ని అందుబాటులో ఉంచారు. ప్రత్యేక వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఆమెకు ఎప్పుడు తీవ్ర నొప్పులు వచ్చినా.. ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు అన్నీ సిద్ధంగా ఉంచారు. రేవతి భర్త, ఆమె తల్లి అందుబాటులో ఉన్నారు.

# రాజ్యాంగ పరిక్షణకు తీసుకున్న చర్యలేవీ

మాకు పాఠాలు చెబుతున్నారు. అవాస్తవాలతో దేశాన్ని తప్పుదోవపట్టిస్తున్నారు. గోబెల్స్ కంటే కూడా అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ తెచ్చిన ఆహార భద్రత చట్టం కొవిడ్ సమయంలో పేదలను ఆదుకొంది. రాజ్యాంగం బలోపేతానికి ప్రధాని ఏం చర్యలు తీసుకున్నారు? ఏం సాధించామో ఎవరికి వారు ఆత్మ పరిశీలన చేసుకోవాలి' అన్నారు. 'మనుస్మృతి ఆధారంగా లేదని రాజ్యాంగాన్ని ఆరెస్సెస్ వ్యతిరేకించింది. రాజ్యాంగాన్ని, జాతీయ జెండాను వారు అంగీకరించలేదు. 2002 జనవరి 26న తొలిసారి ఆరెస్సెస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఎగురవేయాల్సిన తప్పనిపరిస్థితి ఎదురైంది. ప్రధాని నరేంద్ర మోదీ అవాస్తవాలు చెబుతున్నారు. ప్రజలకు రూ.15లక్షలు చొప్పున వేస్తానని అవాస్తవాలు చెప్పారు. రాజ్యాంగాన్ని బలోపేతం చేసేందుకు గత 11 ఏళ్లలో ప్రధాని నరేంద్ర మోదీ ఏం చేశారు? 1971లో పాకిస్థాన్‌ను భారత్ ఓడించి తూర్పుపాకిస్థాన్‌కు (నేటి బంగ్లాదేశ్) విముక్తి కల్పించిన రోజు (డిసెంబర్ 16న)ను విజయ్ దివస్‌గా చేసుకొంటున్నాం. బంగ్లాదేశ్‌లో మైనార్టీలను ఆదుకోవడంలో ఇందిరా గాంధీని భాజపా నేతలు స్ఫూర్తిగా తీసుకోవాలి' అని సూచించారు. రాజ్యాంగం






అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రాజ్యసభలో చర్చ మొదలయ్యింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నేత మల్లికార్జున ఖర్గే సోమవారం సభలో ప్రసంగిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'అమిత్ షా పెద్ద వాషింగ్ మిషన్ కొన్నాడు. ఆ మెషిన్‌లోకి ఎవరెళ్లినా.. వారు పరిశుద్ధులై బయటకొస్తారు' అని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షపార్టీ నేతలపై ఈడి దాడులతో కేంద్రం అవినీతిపరులుగా ముద్ర వేస్తోంది. ఆ సమయంలో వారు బిజెపిలోకి చేరుతున్నారు. వీరలా బిజెపిలోకి చేరగానే.. అవినీతిపరులు కాస్తా.. నీతిపరులైపోతున్నారన్న అర్థం వచ్చేలా సభలో ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఏదైనా రాష్ట్రం లేదా ప్రాంతంలో మీకు వ్యతిరేకంగా ఓటు వేస్తే? వ్యతిరేకంగా మీరు ప్రతీకారం తీర్చుకోకూడదు' అని ఖర్గే హితవు పలికారు. కాగా, ఎగువ సభలో మణిపూర్ సంక్షోభం అంశాన్ని ఖర్గే లేవనెత్తారు. ప్రధాని మోడీ ఎన్నికలు ఎక్కడుంటే అక్కడికి వెళ్తారు. కానీ ఆయన ఇంతవరకు మణిపూర్ వెళ్లలేదు. అక్కడికెళ్లేందుకు ఆయన ఇష్టపడడం లేదు అని ఖర్గే విమర్శించారు. అదే సమయంలో రాహుల్ మణిపూర్‌కి వెళ్లారని, అక్కడి యాత్ర చేపట్టారని ఖర్గే గుర్తు చేశారు. 'మీకు చాలా భద్రత ఉంది. అయినా మణిపూర్‌కి మీరెందుకు వెళ్లడం లేదు? మీరు ఈ సమస్యను ఎందుకు పరిష్కరించడం లేదు' అని ఖర్గే ప్రధానిని నిలదీశారు.

# హైదరాబాద్ రెండో రాజధాని దిశగా అడుగులు పడుతున్నయా?

ఈమధ్య సుప్రీంకోర్టు ఢిల్లీ నగరాన్ని ఏం చేయబోతున్నారని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కూడా ఢిల్లీలో కాలుష్యం తీవ్రంగా ఉందని,. తాను ఎప్పుడు ఢిల్లీకి వచ్చినా అనారోగ్యం పాలవుతున్నానని ఇటీవల చెప్పుకొచ్చారు. ఇలాంటి పరిణామాల మధ్య ఢిల్లీని దేశ రాజధానిగా ఇంకా కొనసాగించాలా అని సాక్షాత్తు సీనియర్ కాంగ్రెస్ నేత శశి థరూర్ ఈ మధ్య కాలంలో చేసిన వ్యాఖ్యలు ఆలోచింపదగినవి. థరూర్ వ్యాఖ్యలు దేశ రాజధానిపై మరోసారి దేశవ్యాప్త చర్చకు దారితీశాయి..

దక్షిణాదిన రెండో రాజధాని ఉండాలన్న ప్రస్తావన చాలా దశాబ్దాలుగా వస్తున్నదే. దేశానికి రెండో రాజధానిగా హైదరాబాద్ ఉండాలన్న చర్చ స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలోనే వచ్చింది. ఈ ప్రతిపాదనను రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తన 'థాట్స్ ఆఫ్ లింగ్విస్టిక్ స్టేట్స్' అనే పుస్తకం 11వ అధ్యాయంలో హైదరాబాద్‌ను రెండో రాజధానిగా చేయాలని స్వయంగా ప్రతిపా దించారు. దీనికి అనుకూలంగా కొన్ని బలమైన కారణాలను కూడా చూపారు. మన శత్రు దేశాలైన పాకిస్తాన్, చైనా దేశ సరిహద్దుకు ఢిల్లీ కేవలం 300 కిలోమీటర్ల దూరంలో ఉందని. కానీ, హైదరా బాద్ సుదూరంగా ఉండటం దేశ భద్రతాపరంగా, అన్ని వాతావరణ పరిస్థితులకు అనువైన ప్రాంతమని గట్టిగా వాదించారు.

ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరంగా ఢిల్లీ మారింది. గతంలో హైదరాబాద్‌లో ఎత్తైన అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు హాజరైన అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్ హైదరాబాద్‌ను రెండో రాజధానిగా అంబేద్కర్ గుర్తు చేసినప్పుడు కూడా ఈ చర్చ జరిగింది.

మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు ఎప్పటికైనా హైదరాబాద్ దేశానికి రెండో రాజధానిగా అవుతుందన్న నమ్మకం ఉందన్నారు.

ఇదిలావుంటే, గత ఏడాది రేవంత్ రెడ్డి సీఎంగా ప్రమాణం చేసిన తర్వాత నుంచి ముఖ్యమంత్రి హోదాలో తీసుకుంటున్న చర్యలన్ని భవిష్యత్తు దృష్ట్యా హైదరాబాద్‌ను మహా విశ్వనగరంగా మార్చే ప్రయత్నంలో తీసుకుంటున్నవే. ఢిల్లీ తరహా పరిస్థితులు తలెత్తకుండా హైదరాబాద్ రెండో రాజధాని ఖచ్చితంగా కావొచ్చనే ముందుచూపుతోనే హైడ్రాలాంటి కఠిన చర్యలు తీసుకుంటున్నారని రాజకీయ విమర్శకులు ప్రశంసిస్తున్నారు. అలాగే, కాలుష్యరహిత నగరంగా మార్చేందుకు డీజిల్/ పెట్రోల్ వాహనాలను తరలించి పొల్యూషన్ రహిత ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడం వెనక కారణం కూడా ఇదేనని కొందరి వాదన. అలాగే, ప్రపంచవ్యాప్తంగా 140 దేశాల్లోని 258 ప్రపంచ నదులలో అత్యంత కాలుష్యంగా మూసీ నది 22వ స్థానంలో ఉన్నట్లు ది ప్రొసీడింగ్స్ ఆఫ్ నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ జర్నల్ లో ప్రచురితమైంది. కనీసం 70 కిలోమీ టర్ల మేర 48 రకాల క్యాన్సర్ కారకాలైన రసాయన అవశేషాలు లభించాయి. ఈ కలుషితమైన నీరు ప్రజల ఆరోగ్యానికి భారీగా హాని చేస్తోందనీ పరిశోధనలు తేల్చాయి. ప్రతిపక్షాల నుంచి ప్రభుత్వం ఎన్ని విమర్శలు ఎదుర్కొన్నా మూసీ పునరుజ్జీవానికి కట్టుబడి ఉంటామని ప్రకటించ డం, అలాగే ఉన్న నగరంపై మరింత జనసాంద్రత పెరగకుండా ఫోర్త్ సిటీ ఆలోచన కూడా వెనుక కూడా రెండో రాజధాని వ్యూహమే ఉన్నట్లు అనుకోవచ్చేమో! అలాగే, 2019 మల్కాజిగిరి పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో రెండో రాజధాని ఆలోచనకు మద్దతు ఇచ్చారు. ఇక రెండో రాజధాని ఆలోచన బీజేపీకి ఖచ్చితంగా ఉందని ఆ నాయకుల వ్యవహార శైలి, మాటలు తదితర పరిణామాలతో వెల్లడవుతూ వస్తోంది.

# మహా కుంభమేళా.. 45 కోట్ల మంది యాత్రికుల కోసం ఏర్పాట్లు!



భోపాల్: ప్రయాగ్‌రాజ్‌లో జరిగే మహా కుంభమేళా కోసం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. దాదాపు 45 కోట్ల మంది యాత్రికులు, సాధువులు, పర్యటకుల కోసం సన్నాహాలు చేశామని ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం వెల్లడించింది. భోపాల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యూపీ జల్‌శక్తి మంత్రి స్వతంత్ర దేవ్ సింగ్ మాట్లాడుతూ.. గతంలో కంటే అద్భుతంగా జరగనుందని చెప్పారు. "ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళాకు దాదాపు 45కోట్ల మంది యాత్రికులు, సాధువులు, సన్యాసులు, పర్యటకులు రానున్నట్లు అంచనా వేస్తున్నాం. దీనిని స్వచ్ఛంగా, ఆరోగ్యంగా, సురక్షిత, డిజిటల్ కార్యక్రమంగా మార్చేందుకు యూపీ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఒకేసారి వాడి పాడేసే ప్లాస్టిక్ రహితంగా నిర్వహించనున్నాం" అని యూపీ మంత్రి పేర్కొన్నారు. ప్రయాగ్‌రాజ్‌లో దాదాపు 3లక్షల మొక్కలు నాటామని, కుంభమేళా పూర్తైన తర్వాత కూడా వాటిని పరిరక్షిస్తామని చెప్పారు. ప్రయాగ్‌రాజ్‌లో జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు ఈ మహా కుంభమేళా కొనసాగనుంది. ప్రతి 12 సంవత్సరాలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు దేశవ్యాప్తంగా కోట్లాది మంది యాత్రికులు ప్రయాగ్‌రాజ్‌కు చేరుకుంటారు.

# పోలవరం ఎపికి గేమ్ ఛేంజర్

పేరుతో ప్రాజెక్టు ను నాశనం చేసారన్నారు. కుట్ర, కుతంత్రాలు, రాజకీయాలతో ప్రాజెక్టు సర్వ నాశనం చేసారని, 2020తర్వాత వచ్చిన వరదలతో గ్యాప్ 1 లో రెండు వందల మీటర్ల మేర అగాధాలు ఏర్పడ్డాయని, వైబ్రో కాంపాక్షన్ ద్వారా ఇసుకతో ఆగాధాలు పూడ్చి పనులు చేయాలన్నారు. ప్రాజెక్టు నిర్లక్ష్యం చేయడం వల్ల2,400 కోట్లు అదనంగా ఖర్చు అవుతుందని, ఖీఓఅ, ఒఓఅ కెనాల్ పనులు పూర్తి చేయాల్సి ఉందని, పోలవరం 2026అక్టోబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంతో ఉన్నామన్నారు సీఎం చంద్రబాబు. ఎప్పుడెప్పుడు ఏ పని చేయాలనే విషయంలో అధికారులు పూర్తి క్లారిటీతో ఉండాలి..ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని ఆయన అధికారులకు సూచించారు. టీడీపీ ప్రభుత్వం కొనసాగి ఉంటే 2021నాటికి ప్రాజెక్టు పూర్తి అయ్యేదని, పట్టిసీమ లేకుండా ఉంటే కృష్ణ డెల్టా ఎడారిగా మారేదన్నారు. ఒక వ్యక్తి అలసత్వానికి పోలవరం ఒక నిదర్శనమని,



నాశనం అయినా ప్రాజెక్టు ను గాడిలో పెట్టడమే కాకుండా పూర్తి చేయడం లక్ష్యమన్నారు సీఎం చంద్రబాబు. తెలిసి చేసినా , తెలియక చేసినా తప్పు తప్పే అని చంద్రబాబు అన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కూడా రాష్ట్రానికికి నీటి సమస్య ఉండదని తెలిపారు. చైనాలో ఉండే త్రీ జాగాడ్జెస్ డ్యాం కంటే పోలవరం ఎత్తయిన ప్రాజెక్టు అని చెప్పుకొచ్చారు. 2014లో తెలంగాణాలోని ఏడు మండలాలు ఇస్తేనే ప్రమాణం చేస్తానంటే, కేంద్రం ఆ మండలాలను విలీనం చేశారని తెలిపారు. అప్పట్లో డయాఫ్రం వాల్‌ను460 కోట్లతో బావర్ సంస్థ నిర్మించిందని.. మొత్తం మీద 72 శాతం పనులు చేశామన్నారు. 30 సార్లు పోలవరం వచ్చానని.. అలాగే 80 సార్లు వర్చువల్‌గా రివ్యూ చేసినట్లు తెలిపారు. అటువంటి ప్రాజెక్టును వైసీపీ సర్వనాశనం చేసిందని మండిపడ్డారు. 2020లో కాపర్ డ్యాం గ్యాప్‌ను కట్టకపోవడంతో వరద వలన డయాఫ్రం వాల్ దెబ్బతిందని.. ఇప్పుడు డీ వాల్ కట్టాలంటే రూ.2400 కోట్లు అదనంగా అవుతుందన్నారు. రూ.440 కోట్లు అప్పటి డి వాల్‌కు అయ్యిందని.. కేంద్రం పోలవరంకు ఇచ్చిన నిధులను మళ్ళించారన్నారు. ప్రాజెక్టుకు సంబంధించి సివిల్ వర్క్స్ 71.3 శాతం తాము చేస్తే, వారు కేవలం 3.5 శాతం మాత్రమే చేశారని వెల్లడించారు. రూ.12,150 కోట్లను మొదటిదశ గా కేంద్రం మంజూరు చేసిందని.. రూ.2150 కోట్లు నిధులను విడుదల చేశారన్నారు.

వేగుచుక్క

# ఓయు ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ ధర్నా.

- ఫెయిల్ అయిన ప్రతిపేపర్ కి రూ" 1000 నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్.





**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్, డిసెంబర్ 16:**

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు పరీక్ష ఫీజుతో పాటు ఫెయిల్ అయిన ప్రతి పేపర్ కి 1000 రూపాయలను కట్టాలని నిర్ణయించడాన్ని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్ మూర్తి తీవ్రంగా ఖండించారు. దీనిని వ్యతిరేకిస్తూ ఇంజనీరింగ్ విద్యార్థుల ఆధ్వర్యంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ కార్యాలయం ముందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఓయూ పరిశోధక విద్యార్థి ఆర్.ఎల్ మూర్తి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భ ంగా ఆయన మాట్లాడుతూ, యూనివర్సిటీ పరీక్ష ఫీజుతోపాటు ప్రతి పేపర్ కు వెయ్యి రూపాయలు వసూలు చేయడం సరైనది కాదని, తక్షణమే దీన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి పేపర్ కు వెయ్యి రూపాయలు అంటే పేద వెనుకబడిన విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. యూనివర్సిటీ పరీక్ష షెడ్యూలు ప్రకటించినప్పుడు ఒక నిర్ణయం, తర్వాత మరొక నిర్ణయం తీసుకోవడం సమంజసమైంది కాదని పేర్కొన్నారు. అదేవిధంగా రివాల్యుయేషన్ ఫలితాలు విడుదల కాకముందే ఎగ్జామ్ ఫీజు చివరి తేదీ పెట్టడం విద్యార్థులని నష్టపరచడమేనని అన్నారు. తక్షణమే విద్యార్థుల రివాల్యుయే షన్ ఫలితాలను ప్రకటించాలని, పరీక్ష ఫీజు తేదీన కూడా పొడిగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కంట్రోలర్ ప్రొఫెసర్ శశికాంత్ ధర్నా వద్ద విద్యార్థు లతో మాట్లాడారు. కంట్రోలర్ సానుకూల స్పందన మేరకు ధర్నా కార్యక్రమాన్ని విరమించారు.

# తెలుగు సాహిత్యంలో సుంకరి గంగాధర్ కు డాక్టరేట్





**వేగుచుక్క న్యూస్, నిజమాబాద్, డిసెంబర్ 16:** వేల్పూర్ మండలం, వాడి గ్రామానికి చెందిన సుంకరి గంగాధర్ సమర్పించిన పరిశోధనకు గాను ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ పట్టా ప్రకటించింది. సారంగపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు స్కూల్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న సుంకర గంగాధర్ " తెలంగాణ స్మృతి కవిత్వం సమగ్ర పరిశీలన' అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. ప్రసిద్ధ కవి, పరిశోధకుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం సుంకరి గంగాధర్ పరిశోధనకు పర్యవేక్షకునిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య సాగి కమలాకర్ శర్మ, ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య చింతకింది కాసిం, డాక్టర్ రఘు, ఆచార్య వారిజారాణి , డాక్టర్ సల్ల సత్యనారాయణ, డి. గోపాల్, ఘనపురం దేవేందర్, డాక్టర్ భాగ్యలక్ష్మి తదితరులు గంగాధరును అభినందించారు.

# విద్యార్థి నాయకులను విడుదల చేయాలి.

- పిడిఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్.



**వేగుచుక్క న్యూస్, నిజమాబాద్, డిసెంబర్ 16:**

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ముందస్తుగా తెలంగాణ యూనివర్సిటీ పి.డి.ఎస్.యూ నాయకులు రవీందర్, అక్షయ్, రాకేష్ లను అరెస్టు చేసి డిచ్ పల్లి పోలీస్ స్టేషన్ కి తరలించారు. దీనిని పిడిఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ ఖండిస్తూ, వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తుందని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించక ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నాయని అన్నారు. ఇప్పటివరకు కూడా విద్యాశాఖ మంత్రిని నియమించలేదని, యూనివర్సిటీలకు అందాల్సిన స్పెషల్ గ్రాండ్స్ ను విడుదల చేయడం లేదని పేర్కొన్నారు. యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, యూనివర్సిటీ విద్యార్థులకు నెలకు 2000 రూపాయలు పేలోషిఫ్ ఇవ్వాలని అన్నారు.

# క్రీడల్లో ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయిలో రాణించాలి.





**జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.**

**ఘనంగా చీఫ్ మినిస్టర్స్ కప్ 2024 ప్రారంభం.**

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, డిసెంబర్ 16:**



జిల్లా స్థాయిలో గెలుపొంది రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం స్థానిక ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో చీఫ్ మినిస్టర్స్ కప్ 2024 జిల్లా స్థాయి పోటీలను కలెక్టరు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, చీఫ్ మినిస్టర్స్ కప్ 2024 సందర్భంగా జిల్లాలో గ్రామీణ, మండల స్థాయిల్లో క్రీడా పోటీలను నిర్వహించడం జరిగిందని, ఈ రోజు నుండి ఈ నెల 21 వరకు జిల్లా స్థాయి పోటీలు నిర్వహించడం జరుగుచున్నదనీ తెలిపారు. 16 ఈవెంట్స్ లో 323 క్రీడాకారులు జిల్లా స్థాయిలో పాల్గొంటున్నారని తెలిపారు. సి.ఎం. కప్ 2024 క్రీడల్లో 8000 మంది క్రీడాకారులు పాల్గొన్నారని, ఇందులో 2000 మంది క్రీడాకారులు సెలెక్ట్ కావడం జరిగిందని తెలిపారు. గెలుపు ఓటమి లు కాకుండా పాల్గొనడం అనేది ముఖ్యం అని అన్నారు. జిల్లా స్థాయి క్రీడా కారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ ను కనబరచాలనీ తెలిపారు. జాతీయ స్థాయి క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. జిల్లా గ్రంధాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి మాట్లాడుతూ, ఆటలతో పాటు చదువులో రాణించాలని అన్నారు. క్రీడల పట్ల ముఖ్యమంత్రి సానుకూలం అని, క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందించడం జరుగుతుందని తెలిపారు. కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ ఇందు ప్రియ మాట్లాడుతూ, జిల్లాలోని 25 మండలాల్లో 8 వేల మంది క్రీడాకారులు పాల్గొన్నారని, చదువుతో పాటు సాంస్కృతిక, క్రీడల ల్లో రాణించాలని తెలిపారు. క్రీడల్లో ఆడి ఓడిన చింతించకూడదని , జిల్లా స్థాయి వరకు రావడం అభినందనీయమన్నారు. జిల్లాకు సి.ఎం. కప్ తీసుకురావాలని కోరారు. జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి జగన్నాథన్ మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిల్లో గెలుపొందిన క్రీడాకారులు 323 మంది జిల్లా స్థాయిలో ఆడుతున్నారని తెలిపారు. అనంతరం జిల్లా స్థాయి క్రీడలను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రంగనాథ్ రావు, వార్డ్ కౌన్సిలర్ వనిత రాం మోహన్, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షులు జైపాల్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్స్, పి.ఈ.టీ.లు, పలు అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడా కారులు, పాల్గొన్నారు.

# బిఎల్ పి రాష్ట్ర అధ్యక్షులుగా దండి వెంకట్

ప్రధాన కార్యదర్శిగా సిరిగాద సిద్దిరాములు, ఎన్నిక.

**వేగుచుక్క న్యూస్, నిజమాబాద్, డిసెంబర్ 16:**





బహుజన లెఫ్ట్ పార్టీ (బహుజన కమ్యూనిస్టు) రాష్ట్ర ప్రథమ మహాసభలలో రాష్ట్ర అధ్యక్షుడిగా దండి వెంకట్ , ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నట్టు ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్ల సూర్య ప్రకాష్ తెలిపారు.

జిల్లా కేంద్రంలో రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశాల్లో పలు ప్రజా సమస్యలపై చర్చించి, భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకున్నట్టు ఆయన పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో పడిపోతున్న ఉష్ణోగ్రతలు

గతంల ఎన్నడూ లేనంతగా 7.1 డిగ్రీలుగా నమోదు



**హైదరాబాద్:** హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. గత ఆరేండ్లలో ఎన్నడూ లేనంతంగా కనిష్టానికి పడిపోయాయి. హెచ్‌సీయూ, మౌలాలీలో అత్యల్పంగా 7.1 డిగ్రీలు, బీహెచ్‌ఈఎల్‌లో 7.4, రాజేంద్రనగర్‌లో 8.2, గచ్చిబౌలి 9.3, వెస్ట్ మారేడుపల్లి 9.9, కుత్బుల్లాపూర్, మచ్చబొల్లారం 10.2, శివరాంపల్లి 10.3, జీడిమెట్ల 11.4, బాలానగర్ 11.5, పటాన్‌చెరు 11.7, షాపూర్‌నగర్ 11.7, లింగంపల్లి 11.8, బోయిన్‌పల్లి 11.9, బేగంపేట 12, ఆసిఫ్‌నగర్ 12, నేరెడ్‌మెట్ 12.1, లంగర్‌హౌస్ 12.2, మోండా మార్కెట్ 12.4, చందానగర్ 12.7, షేక్‌పేట 12.8, మాదాపూర్ 12.8, ముషీరాబాద్ 12.9, చాంద్రాయణగుట్ట 13, కూకట్‌పల్లి 13.1, గోల్కొండ 13.2, సఫిల్‌గూడ, హయత్‌నగర్ 13.3, ఉప్పల్ 13.4, మల్లాపూర్ 13.5, ఆదర్శ్‌నగర్ 13.5, తిరుమలగిరి, చర్లపల్లి 13.6 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రాష్ట్రంలోనే అతితక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా బేలాలో 6.3 డిగ్రీలు రికార్డయ్యాయి. నిర్మల్ జిల్లా తాంద్రలో 6.3, ఆదిలాబాద్ జిల్లా పోచర 6.4, జైనాథ్ 6.5, అర్లి (టీ) 6.6, చాప్రాల్ 6.6, సంగారెడ్డి జిల్లా సత్వార్ 6.6, వికారాబాద్‌లోని బంట్వారం 6.7, సంగారెడ్డిలోని న్యాల్కల్‌లో 6.7, ఎలిమినేడు, రాచలూరు (రంగారెడ్డి) 6.7, సిర్పూర్ యూ (ఆసిఫాబాద్) 6.7, చందనపల్లి (రంగారెడ్డి) 6.7, కోహీర్ (సంగారెడ్డి) 6.7, మర్పల్లి (వికారాబాద్) 6.8, వికారాబాద్ జిల్లాలోని నగరం (టీ), మన్నెగూడలో 6.8, నల్లవెల్లి (సంగారెడ్డి) 6.8, పోతరరెడ్డిపేట (సిద్దిపేట) 6.9, జహీరాబాద్ (సంగారెడ్డి) 6.9, మెనూర్ (కామారెడ్డి) 6.9, రాఘవపేట (జగిత్యాల) 7.3, కెరమెరి (ఆసిఫాబాద్) 7.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉత్తరాది నుంచి ఈదురుగాలులు, శీతల పవనాలు వీస్తుండటంతో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. దీంతో ప్రజలు బయటకు రావడానికి జంకుతున్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి.

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు.



**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, డిసెంబర్ 16**

: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 94 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీఆర్డీఓ సాయాగౌడ్, ఇంచార్జ్ డీపీఓ శ్రీనివాస్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ట్రాక్టర్లతో ర్యాలీగా శంభూ బార్డర్ రైతులు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం తమ డిమాండ్‌లను నెరవేర్చాలంటూ రైతులు చేపట్టిన ఆందోళన కొనసాగుతోంది. పంజాబ్-హర్యానా మధ్యనున్న శంభూ బార్డర్‌లో రైతులు తమ ఆందోళన కొనసాగిస్తున్నారు. రైతులు ఢిల్లీ లోపలికి ప్రవేశించకుండా భద్రతా బలగాలు అడ్డుకుంటుండటంతో.. వారు అక్కడే మకాం వేసి ఆందోళన చేస్తున్నారు. సోమవారం పంజాబ్ నుంచి రైతులు ర్యాలీగా ట్రాక్టర్‌లపై శంభూ బార్డర్‌కు బయలుదేరారు. ఈ నేపథ్యంలో భద్రతాబలగాలు శంభూ బార్డర్‌లో భద్రతను కట్టుదిట్టం చేశాయి. రైతులు ఢిల్లీ లోపలికి ప్రవేశించకుండా బారికేడ్లను మరింత పెంచారు. పంటకు కనీస మద్దతు ధర సహా పలు డిమాండ్‌ల పరిష్కారం కోసం రైతులు ఢిల్లీ సరిహద్దుల్లో ఆందోళన చేస్తున్నారు. కానీ కేంద్ర సర్కారు మాత్రం వారి ఆందోళనను పట్టించుకోవడం లేదు. పైగా పోలీసులతో వారిపై దాడి చేయిస్తోంది. కాగా, కేంద్రం తీరుకు నిరసనగా ఈ నెల 18న పంజాబ్‌లో రైల్‌రోకో నిర్వహించనున్నట్లు రైతులు ఇప్పటికే హెచ్చరించారు.

వేగుచుక్క

# పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు..

తెలంగాణలోని హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పూర్తిగా పడిపోయిందంటూ జరుగుతున్న ప్రచారంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందించారు. హైదరాబాద్ నుంచి రియల్ ఎస్టేట్ రంగమంతా అమరావతికి వెళ్తుందని జరుగుతున్న ప్రచారాన్ని మంత్రి కొట్టిపారేశారు. అమరావతిలో వచ్చి వరదల కారణంగా.. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఇన్వెస్టర్లు భయపడుతున్నారని తెలుస్తోంది. అమరావతి కంటే.. హైదరాబాద్, బెంగళూరు వైపే మొగ్గు చూపుతున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో సీఎంగా చంద్రబాబు రాగానే.. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పూర్తిగా పడిపోయిందని.. అమరావతికే పెట్టుబడులన్నీ వెళ్తున్నాయని.. రియల్ ఎస్టేట్ రంగం అమరావతికి వెళ్తుందంటూ జరుగుతున్న ప్రచారంపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. మీడియాతో చిట్ చాట్‌లో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.. చంద్రబాబు రాగానే రియల్ ఎస్టేట్ అమరావతికి పోతుందనేది కేవలం ప్రచారం మాత్రమేనని క్లారిటీ ఇచ్చారు.

ఏపీలో చంద్రబాబు రాగానే హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పడిపోయిందనేది తప్పుడు ప్రచారమని కొట్టిపడేశారు. చంద్రబాబు వచ్చిన తర్వాత ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ఇన్వెస్టర్లు భయపడుతున్నారని కీలక వ్యాఖ్యలు చేశారు. అమరావతిలో వరదల కారణంగా ఏపీకి పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదని చెప్పుకొచ్చారు. వరదల వల్ల పెట్టుబడులు పెట్టే వారికి భయం పట్టుకుందన్నారు. అమరావతి కంటే.. హైదరాబాద్, బెంగుళూరు నగరాల్లోనే పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీలు ప్రాధాన్యత ఇస్తున్నాయని పేర్కొన్నారు. హైడ్రా భయం ప్రజల్లో ఏమాత్రం లేదని.. మొదట్లో తప్పుడు ప్రచారం జరిగినా.. ప్రజలకు ఇప్పుడు నిజం తెలిసిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

అప్పులపై కేటీఆర్, బీఆర్ఎస్ నిజాలు తెలుసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. బీఆర్ఎస్ నాయకులు కార్పొరేషన్ లోన్స్‌తో కలిపి మొత్తం లెక్కలు బయటపెట్టాలని మంత్రి డిమాండ్ చేశారు. కార్పొరేషన్ పేరుతో చేసే అప్పులు కూడా ప్రభుత్వ ఖాతాలోకే వస్తాయనేది కేటీఆర్ తెలుసుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రానికి 7 లక్షల 20 వేల కోట్ల అప్పులన్నాయని మంత్రి వివరించారు.

శాసనసభలో ఎవరి పాత్ర వారిదేనని.. ప్రివిలేజ్ మోషన్ ఇవ్వడమనేది ప్రతిపక్షాల హక్కు అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కేసీఆర్ అసెంబ్లీకి రాకుండా కొసరుతో కొట్లాడుతున్నారని విమర్శించారు. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే ఆయనతో వ్యక్తిగతంగా కూర్చొని మాట్లాడాలనే కోరిక ఉన్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు.

మరోవైపు.. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో క్రమంగా ఆదాయం పెరుగుతుందని.. అది తమ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ఏడాది పాలనపై ఎలాంటి వ్యతిరేకత లేదని కేవలం ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో కూడా ఇలానే ప్రచారం జరిగిందని గుర్తు చేసిన మంత్రి పొంగులేటి.. రెండు మూడేళ్లల్లో అన్ని సర్దుకున్నాయన్నారు. వర్షాలు బాగా పడి వ్యవసాయంతో పాటు అన్ని రంగాలు అభివృద్ధి పథంలో నడిచాయని పొంగులేటి వివరించారు.



# కొత్త రేషన్ కార్డులు.. ఉత్తమ్ కీలక ప్రకటన

తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల కోసం అర్హులైన వారు ఎదురు చూస్తున్నారు. రేషన్ కార్డులు ఇదిగో.. అదిగో.. అంటూ ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. ఈ నేపథ్యంలో కొత్త రేషన్ కార్డుల మంజూరుపై తాజాగా మంత్రి ఉత్తమ్ కీలక ప్రకటన చేశారు. సంక్రాంతి నుంచి రేషన్ కార్డులు మజూరు చేస్తామని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు.

కొత్త రేషన్ కార్డుల కోసం తెలంగాణ ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో చాలా ఏళ్లుగా రేషన్ కార్డులు మంజూరు చేయకపోవటంతో కుటుంబాలు వేరు పడిన వారు, కొత్తగా పెళ్లిళ్లు చేసుకున్న వారు రేషన్ కార్డులు ఎప్పుడెప్పుడు ఇస్తారా..? అని ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో అమలయ్యే దాదాపు అన్ని ప్రభుత్వ పథకాలకు రేషన్ కార్డు లింక్ ఉండటంతో వాటి కోసం నిరీక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో రేషన్ కార్డుల మంజూరుపై తాజాగా సివిల్ సప్లయ్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక అప్డేట్ ఇచ్చారు.




రెండో రోజు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మండలిలో సభ్యుడు అడిగిన ప్రశ్నకు మంత్రి ఉత్తమ్ బదులిచ్చారు. అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామని చెప్పారు. ఈ ప్రక్రియ త్వరలోనే చేపడుతామని.. సంక్రాంతి నుంచి రేషన్ కార్డుల మంజూరీ ఉంటుందని చెప్పారు. ఇప్పటికే రేషన్ కార్డుల మంజూరు విషయంపై క్యాబినెట్ సబ్ కమిటీ వేసినట్లు గుర్తుచేశారు. దాదాపు తెలంగాణ వ్యాప్తంగా 36 లక్షల మందికి కొత్తగా రేషన్ కార్డులు మంజూరు చేసే ఆలోచనలో ఉన్నట్లు వెల్లడించారు. కొత్తగా రేషన్ కార్డులు ఇవ్వటమే కాకుండా సన్నబియ్యం కూడా ఇస్తామని మంత్రి ఉత్తమ్ అసెంబ్లీ వేదికగా ప్రకటించారు.

రేషన్ కార్డుల మంజూరుపై శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కీలక సూచనలు చేశారు. అవసరం ఉన్నవారికి మాత్రమే రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. అసలైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. కొందరు అనర్హులు కూడా రేషన్ కార్డులు పొంది ప్రభుత్వ ఆదాయానికి గండిపెడుతున్నారని అన్నారు. సివిల్ సప్లయ్ అధికారులు సమగ్ర విచారణ జరిపి అవసరం లేని వారి కార్డులను తొలగించాలన్నారు. పేదరికం అనుభవిస్తున్న వారికి మాత్రమే ప్రభుత్వం సరుకులు పంపిణీ చేయాలని మండలి ఛైర్మన్ గుత్తా ప్రభుత్వానికి సూచించారు.

కాగా, ప్రస్తుతం తెలంగాణలో 89.96 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. వీటికి అదనంగా మరో 36 లక్షల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. కొత్త రేషన్ కార్డులు, హెల్త్ కార్డులు విడివిడిగా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ఇది వరకే ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే తాజా గా రేషన్ కార్డుల మంజూరుపై ఉత్తమ్ అసెంబ్లీ వేదికగా ప్రకటనచేయటంతో అర్హులైనవారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




# తెలంగాణలో కొన్ని కొత్త జిల్లాల రద్దు..?

తెలంగాణలో కొత్త జిల్లాల రద్దు ప్రచారంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా శాసనసభలో ఈ అంశంపై ఆయన ప్రస్తావించారు. జిల్లాలను రద్దు చేయాలనే ఆలోచన తమ ప్రభుత్వానికి లేదని చెప్పారు. ప్రస్తుతం ఉన్న అన్ని జిల్లాలను కొనసాగిస్తామన్నారు.

తెలంగాణలో పలు కొత్త జిల్లాలు రద్దు కానున్నాయని గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో, మెయిన్ స్ట్రీమ్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ పాలనలో జిల్లాల విభజన అశాస్త్రీయంగా జరిగిందని.. ఇప్పుడున్న 33 జిల్లాలను కుదిస్తూ 17 లోక్ సభ నియోజకవర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలుగా ప్రకటించనుందనే వార్తలు వచ్చాయి. అసిఫాబాద్, సిద్దిపేట, కామారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, నిర్మల్, జగిత్యాల, మంచిర్యాల, సిరిసిల్ల, సంగారెడ్డి, నారాయణపేట, జనగాం, సూర్యాపేట, భూపాలపల్లి, ములుగు, గద్వాల్, వనపర్తి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు రద్దు అవుతాయనే ప్రచారం జరుగుతోంది.

ఈ నేపథ్యంలో జిల్లాల రద్దుపై తాజాగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా.. శాసనమండలిలో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ఏ జిల్లానూ రద్దు చేయదని స్పష్టం చేశారు. పాత జిల్లాలను రద్దు చేయాలన్న ఆలోచన తమ ప్రభుత్వానికి ఏమాత్రం లేదని అన్నారు. ఈ విషయంపై చాలా రోజులుగా ప్రచారం జరుగుతోందని.. జిల్లాలను రద్దు చేసే ఉద్దేశ్యం తమకు లేదని చెప్పారు. ప్రస్తుతం ఉన్న 33 జిల్లాలు యథావిధిగా కొనసాగుతాయని కుండ బద్దలు కొట్టినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాలు నిధుల కోసం కేంద్రం వద్దకు తరచూ వెళ్తాయని.. వెళ్లిన ప్రతిసారీ నిధులు రావని అన్నారు. తమది పేదల ప్రభుత్వమని.. పేదల కోసం పని చేస్తుందని వెల్లడించారు.

వాడీ వేడిగా బీఏసీ..ఇక తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో భాగంగా స్పీకర్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన బీఏసీ సమావేశం ముగిసింది. సభను ఎన్నిరోజులు నిర్వహించాలన్న దానిపై సమావేశంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. సభ ఎన్నిరోజులు నడుపుతారో చెప్పడం లేదంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ తదితరులు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. సభను కనీసం 15 రోజుల పాటు నడపాలని ప్రభుత్వాన్ని కోరినట్లు హరీష్ వెల్లడించారు. ప్రభుత్వం మాత్రం 3 లేదా 4 రోజులు నడుపుతామని చెబుతోందన్నారు. బీఏసీ లేకుండానే బిల్లులు పెట్టడం సంప్రదాయ విరుద్ధమని హరీశ్ మండిపడ్డారు.

# హైదరాబాద్‌లో కుంకుమపువ్వు సాగు..

## బీటెక్ స్టూడెంట్ అద్భుతమే చేశాడుగా..!

కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ లాంటి హిమపాత ప్రదేశాల్లో మాత్రమే సాగు చేసే.. కుంకుమ పువ్వును హైదరాబాద్ లాంటి నగరాల్లో కూడా సాగు చేయొచ్చని నిరూపిస్తున్నాడు ఓ బీటెక్ సెకండ్ ఇయర్ స్టూడెంట్. 270 చదరపు అడుగుల గదిలోనే కుంకుమ పువ్వును సాగు చేస్తూ.. అద్భుతాన్ని ఆవిష్కరిస్తున్నాడు. ఇప్పటికే 70 గ్రాముల కుంకుమ పువ్వు దిగుబడి రాగా.. మరో 70 నుంచి 80 గ్రాముల కుంకుమపువ్వు వచ్చే అవకాశం ఉందని చెప్తున్నాడు. కేవలం కశ్మీర్ లాంటి హిమపాతాలున్న ప్రాంతాల్లోనే విరబూసే కుంకుమ పువ్వును.. నిప్పులు కురిసే హైదరాబాద్‌లాంటి నగరంలోనూ ఎంతో సులభంగా సాగు చేయొచ్చంటూ నిరూపించాడు ఓ యువకుడు. అయితే.. ఆ యువకుడేమీ వ్యవసాయదారుడో.. వ్యవసాయ కుటుంబ నేపథ్యమో ఉన్నవాడేమీ కాదు. బీటెక్ సెంకడ్ ఇయర్ చదువుతున్న ఓ సాధారణ విద్యార్థి. అయితే.. తనకు వ్యవసాయం మీద ఉన్న ఆసక్తి.. ఏదైనా కొత్తగా చేయాలన్న ఆతృతే ఆ యువకుడి చేత ఈ అద్భుతాన్ని ఆవిష్కరించేలా చేసింది.

బడంగ్‌పేట మున్సిపాలిటీలోని గుర్రంగూడకు చెందిన సింగిరెడ్డి లోహిత్‌రెడ్డి.. ఇబ్రహీంపట్నం గురునానక్ ఇంజనీరింగ్ కాలేజీలో సీఎస్ఈ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. వ్యవసాయం చేయాలన్న ఉత్సాహమే కాకుండా.. ఏదైనా సరికొత్తగా చేయాలని లోహిత్ రెడ్డి భావించాడు. ఈ క్రమంలోనే.. కుంకుమ పువ్వు సాగు గురించి ఆలోచించాడు. కేవలం కశ్మీర్ లాంటి ప్రాంతాల్లోనే కాకుండా.. ఈ మధ్య సాధారణ ప్రదేశాల్లోనూ సాగు చేస్తున్నారన్న విషయాన్ని తెలుసుకున్నాడు. గూగుల్, యూట్యూబ్‌లలో ఈ పంటకు సంబంధించిన వీడియోలు చూశాడు. అంతేకాదు.. సాగు చేసే ప్రాంతాలకు వెళ్లి ప్రతి విషయాన్ని తెలుసుకున్నాడు. ఇంకేముంది.. సాగు మొదలుపెట్టేశాడు.

కుంకుమ పువ్వు సాగు కోసం.. 270 చదరపు అడుగులున్న ఓ గదిని సిద్ధం చేశాడు. గాలిలో తేమ, ఉష్ణోగ్రత సమతుల్యంలో ఉండేలా గదిని రెడీ చేశాడు. పగటి వేళ 17 డిగ్రీల ఉష్ణోగ్రత, రాత్రి 9 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండేలా జాగ్రత్త పడ్డాడు. అక్టోబర్ మొదటివారంలో రూ.2 లక్షలతో కశ్మీర్ నుంచి 200 విత్తనాలు తెచ్చి సాగు మొదలుపెట్టాడు. ట్రేలలో కుంకుమ పువ్వు సాగు చేయటం ప్రారంభించాడు. అక్టోబర్‌లో వేస్తే.. డిసెంబరు నెలలో కుంకుమ పువ్వు ఉత్పత్తి వస్తోంది. ఒక్కో విత్తనానికి రెండు నుంచి మూడు పువ్వులు వస్తాయి. అయితే.. ఈ కుంకుమ పువ్వు మార్కెట్‌లో గ్రాముకు రూ.800 నుంచి 1000 పలికే అవకాశం ఉంది. ప్రస్తుతం చేస్తున్న సాగుతో 150 గ్రాముల వరకు దిగుబడి వస్తుందని లోహిత్ రెడ్డి అంచనా వేస్తున్నాడు. కాగా.. ఇప్పటివరకు 70 గ్రాముల కుంకుమ పువ్వు వచ్చిందని తెలిపాడు. పెంపకం కూడా చాలా సులభంగానే ఉందని తెలిపాడు. ఒక్కసారి ఈ పంట సాగుకు పెట్టుబడి పెడితే ఆ తర్వాత ఎలాంటి ఖర్చు చేయకుండానే పూల ఉత్పత్తి వస్తుందని లోహిత్ రెడ్డి చెప్తున్నాడు.

ఇదిలా ఉంటే.. ఇప్పటికే తెలంగాణలో సిద్దిపేటలో కూడా కుంకుమ పువ్వును సాగు చేస్తుండటం గమనార్హం. సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లిలోని డీఎక్స్ఎన్ మాన్యుఫ్యాక్చరింగ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ వారు ఏరోఫోనిక్ విధానంలో జులైలో ప్రయోగాత్మకంగా కుంకుమ పువ్వు సాగును చేపట్టారు.

# మారనున్న మేడారం రూపురేఖలు..!



మేడారానికి మహర్దశ పట్టనుంది. ఇప్పటివరకు చిన్న చిన్న ఆలయాల్లో ఉన్న వనదేవతలు ఇకపై పెద్ద పెద్ద ఆలయాల్లో కొలువుదీరనున్నారు. ఈ మేరకు.. మేడారం సమ్మక్క, సారక్కకు కొత్త ఆలయాలు నిర్మించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే భారీగా నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం.. ఇప్పుడు టెండర్ ప్రక్రియ కూడా పూర్తి చేసింది. దీంతో.. ఆలయ నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. వచ్చే మాహాజాతర నాటికి ఆలయం నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

అడవి దేవతలకు ఆలయాలు నిర్మించనున్నారు. ఇన్నాళ్లు వనంలోనే ఉన్న అమ్మవార్లు ఇకపై గుడిలో కొలువుదీరనున్నారు. మేడారం అభివృద్ధిపై ఫోకస్ పెట్టిన రేవంత్ రెడ్డి సర్కార్.. ఇప్పటికే పలు పనులు చేపట్టగా.. ఇప్పుడు సమ్మక్క సారక్క అమ్మవార్లకు ఆలయాలు నిర్మించాలని నిర్ణయించింది. అయితే.. 1971లో దేవాదాయశాఖ వనదేవతలైన సమ్మక్క, సారక్కకు ఆలయాలు నిర్మించింది. కాగా.. అవి చిన్నగా ఉండటం, ప్రస్తుతం భక్తుల తాకిడి రోజు రోజుకు ఎక్కువవుతుండటంతో.. జాతర సమయంలో ఇబ్బందిగా మారింది. దీంతో.. అమ్మవార్లకు ఆలయాలు నిర్మించాలని అక్కడి పూజలకు ప్రభుత్వాన్ని కోరుతూ వస్తున్నారు.

పూజారుల విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకున్న దేవాదాయ శాఖ.. ఈ ఏడాది (2024 మార్చి) మహాజాతర ముగిసిన వెంటనే ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. దీంతో.. నవంబరులోనే ప్రభుత్వం.. రూ.1.92 కోట్లు మంజూరు చేసింది. కాగా.. ఆలయ నిర్మాణాలకు టెండర్లు పిలవగా.. ఆ ప్రక్రియ కూడా ఈ నెల 12న పూర్తయ్యింది. దీంతో.. త్వరలోనే ఆలయ నిర్మాణ పనులు కూడా ప్రారంభం కానున్నాయి. 2026లో నిర్వహించే మహాజాతర నాటికి ఆలయాల పనులు పూర్తి చేయాలన్న పట్టుదలతో ప్రభుత్వం ఉంది. ఇప్పటికే నిధులు కూడా ముంజూరు కావటంతో.. పనులు వేగంగా జరుగుతాయని.. త్వరలోనే మేడారం రూపురేఖలు మానున్నాయని అందరూ భావిస్తున్నారు.

మరోవైపు.. మేడారంలోని దేవతల గద్దెల ప్రాంగణం విస్తరణకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. నాలుగు దశాబ్దాల కిందట దాతలు నిర్మించిన గద్దెల ప్రాంగణమే ఇప్పటికీ అందుబాటులో ఉండగా.. జాతరకు ముందు తాత్కాలిక అభివృద్ధి పనులు చేస్తూ ప్రభుత్వాలు చేతులు దులుపుకుంటున్నాయే తప్ప.. శాశ్వతంగా ఏ అభివృద్ధి పని చేయకపోవటం గమనార్హం. దీంతో.. ప్రతిసారీ జాతర సమయంలో భక్తుల నియంత్రణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఇప్పటికే మేడారం వెళ్లే రహదారుల అభివృద్ధికి రూ.17.50 కోట్లు, గెస్ట్ హౌస్‌ల నిర్మాణాలకు రూ.3.50 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేయగా.. అధికారులు పనులు చేపట్టారు. తాజాగా.. వనదేవతల గద్దెల ప్రాంగణంలో భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళికలు కూడా రూపొందిచినట్లు అధికారులు చెబుతున్నారు. సమ్మక్క, సారలమ్మ అమ్మవార్లను దర్శించుకునేందుకు పస్రా, చింతల్, కొండాయి, తాడ్వాయి మీదుగా మేడారంలో ప్రవేశించి.. గద్దెల ప్రాంగణానికి చేరుకొనేందుకు వీలుగా రోడ్ల నిర్మాణానికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది.

మరోవైపు.. భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, విశ్రాంతి భవనాలు, ప్రశాంత దర్శనం రెండో ప్రాధాన్యతగా పనులు చేపట్టనున్నట్టు సమాచారం. అన్ని విషయాలను పరిగణలోకి తీసుకుని.. సాధ్యాసాధ్యాలతో పాటు భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని మేడారం మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది.

# తొలి తెలంగాణ తల్లి విగ్రహం పెట్టింది మేమే..



తెలంగాణ తల్లి విగ్రహంపై రాజకీయ దుమారం రేగుతోంది. ఈనెల 9న సీఎం రేవంత్ సెక్రటేరియట్‌లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఉద్యమ సమయంలో ఉన్న విగ్రహనికి భిన్నంగా కొత్త విగ్రహం తయారు చేయించారు. అయితే కొత్త విగ్రహం అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. గతంలో ఉన్న విగ్రహం కేసీఆర్ కూతురు కవిత రూపంలో ఉందని విమర్శిస్తుండగా.. కొత్త విగ్రహం కాంగ్రెస్ తల్లి విగ్రహం అని బీఆర్ఎస్ నేతలు ప్రతి విమర్శలు చేస్తున్నారు. ప్రతి గ్రామంలో ఉద్యమ సమయంలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహాలు ఏర్పాటు చేస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు.

ఈ నేపథ్యంలో తాజాగా.. మాజీ ఎంపీ, కాంగ్రెస్ మహిళా నేత విజయశాంతి స్పందించారు. తెలంగాణ తల్లి రూపం, మార్పుపై కొట్లాడే హక్కు బీఆర్ఎస్ పార్టీకి లేదని చెప్పారు. తెలంగాణ తల్లి మ్నొదటి విగ్రహాన్ని ఆవిష్కరించింది తామేనని చెప్పారు. తల్లి తెలంగాణ పార్టీ ఆధ్వర్యంలో 2007లో విగ్రహాన్ని ఆవిష్కరించినట్లు ట్విట్టర్ వేదికగా వెల్లడించారు. బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉన్నా.. విగ్రహానికి అధికారిక హొదా, గౌరవం ఇవ్వలేదని అన్నారు. '2007 సంవత్సరంలో మొదటి తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ జరిగింది. తల్లి తెలంగాణ పార్టీ కార్యాచరణలో భాగంగా బడుగు, బలహీన, సబ్బండ వర్గాల తల్లి ప్రతిరూపంగా బీఎస్ రాములు గారి ఆధ్వర్యంలో విగ్రహం రూపుదిద్దుకుంది. అప్పటికి నాటి టీఆర్ఎస్, నేటి బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పన బహుశా జరగలేదు. తదనంతరం టీఆర్ఎస్ (బీఆర్ఎస్), వారి టీఆర్ఎస్ ఆఫీస్‌లో ఒక తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ చేసిర్రు. కానీ, వారు అధికారంలో ఉన్న 10 సంవత్సరాల్లో ఎన్నడూ నాటి సీఎం కేసీఆర్.. తెలంగాణ తల్లి రూపానికి ఒక అధికార పూర్వక హొదా, గౌరవం, ప్రభుత్వ నిర్దేశ విధానాలు కల్పించలేదు. బీఆర్ఎస్ వంటి రాజకీయ పార్టీ ఆవిష్కరించిన తెలంగాణ తల్లి రూపం మార్పుపై ఆ పార్టీ కొట్లాడితే... ఆ హక్కు వారికి ఎక్కడున్నది? తల్లి తెలంగాణ విగ్రహ రూపాన్ని బీఆర్ఎస్ మార్చిందని నాటి మన తెలంగాణ ఉద్యమకారులు కూడా కొట్లాడవచ్చు. మన బోనాలు, బతుకమ్మ సంస్కృతి తరతరాలుగా నిలిచే ఉన్నవి, ఉంటవి. అందుకు రాజకీయ పార్టీల ప్రయోజనార్ధ ప్రమేయం ఎన్నడు ఒక అవశ్యకత కాదు. పానమెత్తుగా ప్రజలు కాపాడుకుంటూనే బతుకుతారు, బతికించుకుంటారు. జై తెలంగాణ' అని విజయశాంతి ట్వీట్ చేశారు.

# నేషనల్ హైవేలుగా రాష్ట్ర రోడ్లు..



తెలంగాణలోని రాష్ట్ర రహదారులకు మహర్దశ పట్టనుంది. రాష్ట్ర రోడ్లను నేషనల్ హైవేలుగా అప్‌గ్రేడ్ చేయనున్నారు. ఈ మేరకు తెలంగాణ సర్కార్ నివేదికలు రూపొందిస్తోంది. నివేదికలను కేంద్రానికి సమర్పించనుండగా.. కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన తర్వాత అప్‌గ్రేడ్ చేయనున్నారు. తద్వారా రోడ్ల కనెక్టివిటీ, అభివృద్ధి జరగనుంది. తెలంగాణలోని రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఇప్పటికే రాష్టంలో అనేక కొత్త రహదారులు నిర్మిస్తుండగా.. మరికొన్ని రహదారుల విస్తరణ పనులు చేపట్టారు. హైదరాబాద్-విజయవాడ సహా రాష్ట్రంలోని ముఖ్య రహదారుల విస్తరణకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ కేంద్రంతో సంప్రదింపులు జరుపుతోంది. పలు రోడ్ల విస్తరణకు కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర రోడ్లను నేషనల్ హైవేలుగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రాష్ట్ర అభివృద్ధిలో రహదారులు కీలక కావటంతో ఆయా రోడ్లను అప్‌గ్రేడ్ చేసేందుకు కసరత్తు ముమ్మరం చేశారు. తెలంగాణ వ్యాప్తంగా 16 ప్రాంతాల్లో 1,767 కిలోమీటర్ల మేర రోడ్లను నేషనల్ హైవేలుగా అప్‌గ్రేడ్ చేయటం లేదా జాతీయ రహదారులకు కనెక్ట్ చేయాలని రేవంత్ సర్కార్ ఆలోచన చేస్తోంది. ఈ మేరకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆయా రోడ్ల వివరాలతో నివేదికలు సిద్ధంచేసి మరోసారి కేంద్రానికి ఇచ్చేందుకు తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ ఏర్పాట్లు పూర్తిచేసింది. ఈ మేరకు త్వరలో కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి సమర్పించేందుకు అధికారులు ఏర్పాట్లు చేసింది. కాగా, ఈ రోడ్లను రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలు, ప్రముఖ దేవాలయాలను కనెక్ట్ చేసేలా రూపొందించారు. మ్నొత్తం 16 రోడ్లకు సంబంధించిన ఆకృతులతో ఆ నివేదికలు సిద్ధం చేసారు. ఈ రహదారులు పూర్తయితే వేగంగా, ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి చేరుకోవచ్చు. ఆయా ప్రాంతాలకు కనెక్టివిటీ పెరగటంతో పాటు అభివృద్ధి కూడా వేగంగా జరగనుంది.